వంతెన నిర్మాణానికి మోక్షమెన్నడో?

ఆ వంతెన నిర్మాణం చేపడితే రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. నాగులపాడు పరిసర గ్రామాల మధ్యన దూరం తగ్గుతుంది. గతంలో రైతుల విజ్ఞప్తి మేరకు దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి స్వయంగా క్షేత్రపరిశీలన చేసి వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇటీవల మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతో ఇరిగేషన్ అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వ అనుమతులు లభిస్తే రైతులతో పాటు ప్రజలకు రాకపోకల సమస్య తీరుతుంది.


నాగులపాడు వద్ద సాగునీటి కాలువలో దిగి ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు చెరువుకు సాగునీటిని అందించే కాలువ పరిసరాల్లో చెర్లోయడవల్లి, పాతజంగాలపల్లి గ్రామాలకు చెందిన 350 ఎకరాల ఆయకట్టు భూములు సాగులో ఉన్నాయి. అందులో 150 ఎకరాల వరకు మామిడి తోటలు ఉన్నాయి. కాలువపై వంతెన నిర్మాణం లేక ఆయకట్టు రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు కొన్ని దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాగులపాడు నుంచి ఆత్మకూరు–సోమశిల రహదారి వరకు 120 అడుగుల రెవెన్యూ బాట ఉంది. ఈ బాటను రోడ్డుగా అభివృద్ధి చేసి వంతెన నిర్మిస్తే సోమశిల మార్గంలోని పలు గ్రామాల ప్రజలకు నాగులపాడు వైపు రాకపోకలు సాగించేందుకు దూరం తగ్గుతుంది. ప్రస్తుతం నాగులపాడుకు చేరుకోవాలంటే 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. వంతెన నిర్మాణం చేపడితే మూడు కిలోమీటర్ల దూరంలోనే గమ్యస్థానానికి చేరుకోవచ్చు. ఆత్మకూరు–సోమశిల రోడ్డు నుంచి 67వ నంబరు జాతీయ రహదారి వైపునకు రాకపోకలు సులభతరమవుతాయి.

నాగులపాడు రైతుల ఆందోళన

తమ గ్రామం నుంచి పంట పొలాల్లోకి వెళ్లేందుకు వీలుగా ఆత్మకూరు చెరువుకు సాగునీటిని అందించే కాలువపై వంతెన నిర్మించాలని నాగులపాడు రైతులు కోరారు. ఈ మేరకు గురువారం కాలువలోని నీటిలో దిగి ఆందోళన చేపట్టారు. వంతెన నిర్మాణంతో తమతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు కలిగే ప్రయోజనాలను వారు వివరించారు. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు.

త్వరలోనే వంతెన నిర్మాణం



మా స్వగ్రామమైన చెర్లోయడవల్లితో పాటు నాగులపాడు, పాత జంగాలపల్లి రైతులు, పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన వంతెన నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే అనుమతులు మంజూరు చేయించి వంతెన నిర్మాణం చేపడతాం. **–కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ, ఆత్మకూరు**

రాకపోకలు సులభతరం



నాగులపాడు వద్ద ఆత్మకూరు చెరువుకు సాగునీటిని తరలించే కాలువపై వంతెన నిర్మిస్తే రైతులకు రాకపోకల సమస్య తప్పుతుంది. పరిసర గ్రామాల మధ్యన రాకపోకల దూరం తగ్గుతుంది.
– గడ్డం శ్రీనివాసులురెడ్డి, రైతు, పాతజంగాలపల్లి

దశాబ్దాల సమస్య



నాగులపాడు వద్ద ఆత్మకూరు చెరువుకు సాగునీటిని తరలించే కాలువపై వంతెన లేక కొన్ని దశాబ్దాలుగా రైతులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎంతో మంది ఎమ్మెల్యేలకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణం చేపడితే రైతులతో పాటు ప్రజలకు రాకపోకల సమస్య తీరుతుంది.
–సోమవరపు రవీంద్రారెడ్డి, రైతు, నాగులపాడు

రూ.50 లక్షలతో ప్రతిపాదనలు



ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు నాగులపాడు వద్ద కాలువపై వంతెన నిర్మాణానికి రూ.50 లక్షల అంచనాలతో ఇటీవల ప్రతిపాదనలు పంపాం. గతనెలలో ఈ విషయమై విజయవాడలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులను ఎమ్మెల్యే కలిశారు. త్వరలోనే ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరయ్యే అవకాశం ఉంది.
– రాపూరు వెంకటేశ్వర్లు, ఏఈ, జలవనరుల శాఖ, ఆత్మకూరు

క్లుప్తంగా

విద్యార్థినికి అభినందనలు

బిట్రగుంట: విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని భావన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభకనబరిచింది. రైతులకు ఉపయోగపడే ఫార్మర్స్ స్టిక్ నమూనాను ప్రదర్శించి ద్వితీయ బహుమతి పొందింది. ఈ సందర్భంగా భావనను జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, సర్పంచ్ గండూరి మంజుల, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ విజయ్, ఉపాధ్యాయులు గురువారం సత్కరించి అభినందనలు తెలిపారు.

ట్యాబ్‌లపై అవగాహన



ఉదయగిరి: దాసరపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల వినియోగంపై ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి గురువారం అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల ఆంగ్ల సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

నేటి నుంచి గాలికుంటుకు టీకాలు

వరికుంటపాడు: జాతీయ పశువ్యాధుల నియంత్రణ పథకంలో భాగంగా పెద్దిరెడ్డిపల్లి పశువైద్యశాల పరిధిలోని గ్రామాల్లోని పశువులకు శుక్రవారం నుంచి నెలాఖరు వరకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయనున్నట్లు పశువైద్యాధికారి ఎస్వీఎస్ రాఘవేంద్రశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న జీ కొండారెడ్డిపల్లి, పామూరుపల్లి, తొడుగుపల్లి, 4న జీ కొత్తపల్లి, తొడుగుపల్లి, 5,6న పెద్దిరెడ్డిపల్లి, తోటలచెరువుపల్లి, 7న యర్రంరెడ్డిపల్లి, ఎస్ కొండాయపాళెం, 8, 9న కృష్ణంరాజుపల్లి, కొండ్రాజుపల్లి, కొండాయపాళెం, 10,11న గొల్లపల్లి, విరువూరు బీసీ కాలనీ, పాపన్నగారిపల్లి, 12,13న మహ్మదాపురం, కోటవర్ధినిపల్లి, విరువూరు, 14న తూర్పుపాళెంలో టీకాలు వేయనున్నట్లు చెప్పారు. 16 నుంచి 31వ తేదీ వరకు పశువైద్యశాలలో టీకాలు వేస్తామని తెలిపారు. పాడి రైతులు నాలుగు నెలలు దాటిన పశువులకు టీకాలు వేయించుకుని గాలికుంటు నుంచి కాపాడుకోవాలని కోరారు.

ఆగమ సలహామండలి సభ్యుడి నియామకం



మర్రిపాడు: చుంచులూరులోని ఇంద్రాక్షాంబిక దేవస్థానం ప్రధానార్చకులు మురళీకృష్ణమాచార్యులు రాష్ట్ర ఆగమ సలహామండలి సభ్యుడిగా నియమితులయ్యారు. గురువారం ఆయన విజయవాడలోని దేవాదాయ శాఖ కమిషనర్ జవహర్‌లాల్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు చుంచులూరు గ్రామస్తులు జొన్నా సత్యనారాయణ, ఇరుకుమాటి మురళీధర్, తదితరులు అభినందనలు తెలిపారు.

గ్యాస్ ధరలను తగ్గించాలి

కావలి రూరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తోందని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.400 ఉన్న వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.1100కు పెరిగిందని గుర్తుచేశారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు

సీతారామపురం: రాష్ట్రస్థాయి రోప్‌జంప్ పోటీలకు సీతారామపురం ఆదర్శ పాఠశాల విద్యార్థులు షేక్ ఫయాజ్‌అహ్మద్, షేక్ రిహాన్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎం రెహమాన్ తెలిపారు. కలిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం నిర్వహించిన రోప్‌జంప్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పెరటి కోళ్ల పంపిణీ



సంగం: స్థానిక వైకేపీ కార్యాలయంలో పొదుపు మహిళలకు గురువారం పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైకేపీ ఏపీఎం విజయలక్ష్మి మాట్లాడుతూ పొదుపు మహిళల స్వయం ఉపాధికి పెరటికోళ్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా సంగం, గాంధీజనసంఘం, దువ్వూరు గ్రామాల్లోని లబ్ధిదారులకు 100 యూనిట్లను పంపిణీ చేస్తున్నామని వివరించారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ఆత్మకూరురూరల్: నుడా ద్వారా మండలానికి మంజూరైన గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నుడా ద్వారా 599 ఇళ్లు మంజూరవగా, అందులో 462 మంది లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయన్నారు. ఇంకా 137 మంది వివరాలు నమోదుచేయాల్సి ఉందన్నారు. 102 మంది లబ్ధిదారుల నిర్మాణాలకు సంబంధించి చెల్లింపులు జరుగుతున్నాయని వివరించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

కావలి: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి ఆర్టీసీ డిపో వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేషన్‌గా ఉన్న ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసుకుని కార్మికులను ఉద్యోగులుగా గుర్తించి 50వేలకు పైగా కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు తన వంతు సహకారం అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రయాణికుల భద్రత, ఉద్యోగుల సంక్షేమానికి వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కృషి చేయాలన్నారు. గతంలో ఆర్టీసీ సర్వీసులు నడుస్తూ రద్దు చేసిన అన్ని మార్గాల్లో పునరుద్ధరణకు ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. అనంతరం ఉద్యోగులు తమ సమస్యలపై వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేసి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.


ఎమ్మెల్యే రామిరెడ్డికి వినతి ప్రత్రం అందజేస్తున్న వైఎస్సార్ ఉద్యోగుల సంఘ నాయకులు

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

- రూ.3.08 లక్షల నగదు, కారు, 8 బైక్‌ల స్వాధీనం

ఆత్మకూరు : ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని పలువురు ఎస్సైలతో పాటు సీఐ ఎం.నాగేశ్వరరావు గురువారం గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఇందులో వెన్నవాడ గ్రామ శివార్లలో వాగు ఒడ్డున పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,08,720 నగదు, ఓ కారు, 8 బైక్‌లు, పది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. పట్టుకున్న వారిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలియజేశారు. దాడుల్లో ఆత్మకూరు, ఏఎస్‌పేట, మర్రిపాడు, వింజమూరు ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వైభవంగా సీతారామలక్ష్మణుల గ్రామోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన రామమందిరంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండోరోజైన గురువారం విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. నూతన సీతారామలక్ష్మణ, హనుమాన్ విగ్రహాలకు ధాన్యాదివాసం, జలాదివాసం, గ్రామోత్సవం నిర్వహించారు. కాగా శుక్రవారం వేకువన నూతన విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు అర్చకులు సత్యనారాయణశర్మ తెలిపారు. అనంతరం సీతారాముల శాంతికల్యాణం, అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు వివరించారు.




తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

కలిగిరి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ కళాధర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని తెలిపారు. జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష

మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలి

సోమశిల: వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ సిబ్బంది కృషి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ బీ వెంకటసుబ్బయ్య అన్నారు. అనంతసాగరం, సోమశిల విద్యుత్ ఉపకేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సోమశిల జలవిద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ సరఫరాకు అనంతసాగరంలో నూతన మీటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉపకేంద్రాలు, విద్యుత్‌లైన్ల మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆత్మకూరు డీఈ జనార్దన్, ఏడీఈ సురేష్, ఏఈ ఎం మురళీకృష్ణ, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటసుబ్బయ్య

సమయాన్ని పాటించాలి



సోమశిల: సచివాలయ సిబ్బంది సమయాన్ని పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి రమణయ్య సూచించారు. రేవూరు, మినగల్లు, ఆమనిచిరువెళ్ల, అనంతసాగరం సచివాలయాలను ఎంపీడీఓ మధుసూదన్ తో కలిసి గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

ఆర్థిక సాయం

ఉదయగిరి: పట్టణంలోని నాగులబావి వీధికి చెందిన షేక్ రషీద్ కుమార్తెకు 24 గంటల కడుపునొప్పి రావడంతో వైద్యఖర్చులకు అప్పసముద్రం గ్రామానికి చెందిన చేజర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత చేజర్ల సుబ్బారెడ్డి రూ.5వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. గురువారం ట్రస్టు ప్రతినిధుల ద్వారా రషీద్ కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. నాయకులు ఎంఏ రియాజ్, గాజుల షారుఖ్, షేక్ ఫైజి పాల్గొన్నారు.

రేషన్ షాపుపై దాడులు

కావలి రూరల్: మండలంలోని చలంచర్లలోని రేషన్‌షాపుపై సివిల్ సప్లయిస్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. రేషన్ డీలర్ వల్లిబోయిన శ్రీనివాసులు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సివిల్‌సప్లయిస్ డీటీ కొత్త వెంకట్రామిరెడ్డి తన సిబ్బందితో కలిసి దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఉండాల్సిన స్టాక్ కంటే 197 కేజీల రేషన్ బియ్యం ఎక్కువగా ఉండడం గుర్తించారు. రేషన్ డీలర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో రూరల్ ఎస్సై వెంకటరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు చేయూత



ఉదయగిరి: వెంగళరావునగర్‌కు చెందిన నిరుపేద కుటుంబాలకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ గురువారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకుని మంచానికే పరిమితమైన షేక్ ఇబ్రహీంకు రూ.10 వేలు అందజేశారు. అలాగే భర్తను పోగొట్టుకుని ఇబ్బందులు పడుతున్న కరిమాపాటి హైమావతికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాజీ సర్పంచ్ మహ్మద్‌ఖాజా, ఉపసర్పంచ్ ఖాజాపీర్, ఆర్ నాగేశ్వరరావు, ఎం మధురెడ్డి, చైతన్య ఉన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ సర్వీసులు

ఆత్మకూరురూరల్: తమిళనాడులోని అరుణాచలం క్షేత్ర సందర్శనకు వెళ్లే భక్తుల కోసం ఆత్మకూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు కరీమున్నీసా గురువారం తెలిపారు. సాయంత్రం 6.30గంటలకు ఆత్మకూరు నుంచి బయలుదేరే బస్సు 7న ఉదయం అరుణాచలానికి చేరుకుంటుందని చెప్పారు. 7న రాత్రి అరుణాచలం నుంచి బయలుదేరి 8న ఉదయం ఆత్మకూరుకు చేరుకుంటుందన్నారు. రానుపోను ఒకరికి సూపర్‌లగ్జరీ బస్సు చార్జీ రూ.1420గా నిర్ణయించామని తెలిపారు. అలాగే ఉదయగిరి డిపో నుంచి 6వ తేదీ సాయంత్రం 5 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుందని చెప్పారు. ఉదయగిరి నుంచి రానుపోను చార్జీ రూ.1650 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం అందుబాటులో ఉందని వివరించారు.

ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి పంచాహ్నిక బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు వేదగిరి కళ్యాణ చక్రవర్తి ఆచార్యులు, ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, ఈఓ రాధాకృష్ణ ఆధ్వర్యంలో అర్చక బృందం విశ్వక్సేనుడి పూజతో అంకురార్పణ కార్యక్రమం ప్రారంభించారు. బ్రహ్మోత్సవాలకు ప్రారంభ సూచికగా శాస్త్రోక్తంగా అంకురార్పణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంకురార్పణలో భాగంగా పుట్టమన్నుతో కప్పిన నవధాన్యాలు మొలకెత్తే వర్ణం ఆధారంగా బ్రహ్మోత్సవాల శ్రేష్టత ఆధారపడి ఉంటుందని అర్చకులు తెలిపారు. స్వర్ణవర్ణంలో మొలకెత్తితే ఉత్సవాలు సర్వోత్తమంగాను, శ్వేత వర్ణంలో మొలకెత్తితే మధ్యమంగానూ ఉంటాయని పేర్కొన్నారు.


అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం తిరుమంజనం, రాత్రికి ధ్వజారోహణ (కొడిముద్దలు), శేషవాహనసేవ, పూలంగి సేవ నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆశీర్వదించండి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : తూర్పురాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కావలి నియోజకవర్గంలో 9 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. కావలి పట్టణం, మండలానికి సంబంధించి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారని చెప్పారు. దగదర్తిలో మండల రిసోర్స్ భవనంలో 1, బోగోలులో వీఎస్సార్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1, అల్లూరులోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో 1 చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారని వివరించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధతో నాడు–నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. పేద పిల్లలకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఇలాంటి మంచి ఆలోచనలతో పరిపాలన చేస్తున్న సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పోటీ చేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, తిరువీధి ప్రసాద్, పరుసు మాల్యాద్రి, గుర్రం వెంకటేశ్వర్లు, మండలి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

ఆత్మకూరు: పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది కృషి చేయాలని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి అన్నారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని వైకేపీ సిబ్బందితో పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు రుణాలను స్వయం ఉపాధికి వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించేలా పొదుపు మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై ఆహారఉత్పత్తుల యూనిట్లను మంజూరు చేస్తోందని తెలిపారు. పొదుపు మహిళలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఏసీ వెంకటేశ్వరరావు, ఏపీడీ రాజు, డీపీఎంఎల్‌హెచ్ భానుప్రతాప్, వివిధ మండలాల ఏపీఎంలు , తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీడీ సాంబశివారెడ్డి

దీర్ఘకాలిక సిరులపంట శ్రీగంధం

దుత్తలూరు: శ్రీగంధం దీర్ఘకాలికంగా సిరులు కురిపించే పంట అని నెల్లూరు కేవీకే సీసీ డీఎల్ శివజ్యోతి పేర్కొన్నారు. స్థానిక సీడ్స్ సంస్థలో శ్రీగంధం సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. బెంగళూరుకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు ప్రొజెక్టర్ ద్వారా శ్రీగంధం మొక్కల పెంపకం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. మర్రిపాడు మండలంలో ఏపిలగుంటలో సాగు చేసిన శ్రీగంధం చెట్లను రైతులకు చూపించి మెళకువలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఆత్మ డీడీఏ శివన్నారాయణ, ఏటీఎంఏ శివజ్యోతి, డాక్టర్ లోకేష్‌బాబు, ఏడీఏ బాలాజీ నాయక్, ఏడీఏ డీఆర్సీ లక్ష్మీమాధవి, సీడ్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శ్రీగంధం సాగుపై అవగాహన కల్పిస్తున్న శివజ్యోతి


ఏఎస్‌పేట దర్గా పీఠాధిపతిపై సస్పెన్షన్ కొనసాగింపు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా పీఠాధిపతిగా పనిచేసిన హఫీజ్ పాషాపై సస్పెన్షన్‌ను కొనసాగిస్తున్నట్లు వక్ఫ్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ అధికారి ఎస్‌కే మహ్మద్‌హుస్సేన్ తెలిపారు. గురువారం ఏఎస్‌పేటలో దర్గా ఆవరణలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పారదర్శకంగా విధులు నిర్వహించకపోవడంతో పీఠాధిపతి హఫీజ్‌పాషాను తాత్కాలికంగా వక్ఫ్‌బోర్డు కమిటీ తొలగించిందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు విశ్రాంత సెరికల్చర్ అధికారి ఏకే నజీర్‌ను విచారణాధికారిగా నియమించిందన్నారు. ఆయన ఆరు నెలల్లోపు నివేదికను అందజేయనున్నారని , అప్పటి వరకు పీఠాధిపతిపై సస్పెన్షన్ కొనసాగనున్నట్లు తెలిపారు. హఫీజ్ పాషాపై సస్పెన్షన్ ప్రకటించిన నాటికి దర్గాలో రూ.6.85 లక్షల బ్యాంకు నిల్వలు ఉన్నాయని తెలిపారు. మరో ఖాతాలో రూ.43వేలు ఉన్నాయన్నారు. ఆ తరువాత పది రోజుల్లోనే దర్గాకు రూ.2.25 లక్షల ఆదాయం వచ్చిందని వివరించారు. ప్రస్తుతం దర్గాలో 33 మంది పనిచేస్తున్నట్లు రికార్డుల్లో ఉందని, దర్గా ఆదాయం తక్కువగా ఉన్నందున వారిని తొలగించక తప్పదన్నారు. దర్గాకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివ రించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్‌ప్రెసిడెంట్ షేక్ షౌకాత్ ఆలీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఓ మహ్మద్‌హుస్సేన్

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


ఉదయగిరిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


రేవూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

సోమశిల: వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ కోరారు. గురువారం ఆమె మండల సచివాలయాల కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డితో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. నాయకులు పాలపాటి నాగార్జునరెడ్డి, పార్లపల్లి రవికుమార్ రెడ్డి, పెయ్యల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రసాద్‌గౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్సి యస్దానీ, ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.